సాక్షి కామారెడ్డి

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



సేవా దృక్పథంతో..

ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయినవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయి కోరారు.

- 8లో ▸



తాగునీటి తిప్పలు

కంబాపూర్ గ్రామంలో వర్షాకాలంలోనూ తాగునీటి సమస్య నెలకొంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /22.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆడపడచులకు బతుకమ్మ కానుక



కామారెడ్డి టౌన్: బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఆడపడచులకు ప్రభుత్వం కానుకలు పంపిణీ చేయడానికి సిద్ధమవుతోంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రేవంతన్న కానుక పేరుతో చేనేత చీరలను పంపిణీ చేయనుంది. అయితే గత ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి మహిళకు ఒక చీర పంపిణీ చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మాత్రమే పంపిణీ చేయనుంది. జిల్లాలో మొత్తం 2,03,689 చీరలను అందించనున్నారు. ఇందులో పట్టణాల్లో 24,272, ఇతర ప్రాంతాలలో 1,79,417 చీరలను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు తెలిపారు.

మారథాన్ రన్నింగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా అశోక్




కామారెడ్డి రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో వచ్చేనెల 2న నిర్వహించే స్వచ్ఛతాన్ ఆఫ్ మారథాన్ రన్నింగ్‌కు జిల్లా రవాణా శాఖ ఉద్యోగి గుగ్గిలం అశోక్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ గ్రామానికి చెందిన అశోక్ పలు జాతీయ, అంతర్జాతీయ మారథాన్ పోటీల్లో పాల్గొని విజయాలను సాధించారు. ఆయనను అమరావతి మారథాన్‌కు ఎంపిక చేయడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా..



కామారెడ్డి టౌన్: ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ జిల్లా బ్రాండ్ అంబాసిడర్‌గా జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ గ్రీన్ క్రార్ప్స్(ఎన్‌జీసీ) డైరెక్టర్ ప్రసన్నకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను నియమించినందుకు విద్యాశాఖకు, ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు సిద్దిరాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.




కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంటోంది. ఏళ్లుగా పార్టీని పట్టుకుని ఉన్నవారిని కాదని.. ఇతర పార్టీల్లోనుంచి వచ్చినవారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న భావన పెరిగిపోతోంది. పార్టీలో పరిస్థితిపై పలువురు నేతలు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను వెల్లగక్కుతున్నారు.


– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

హస్తం.. కొత్తోళ్లకే నేస్తం!

- పాత శ్రేణుల్లో పెరుగుతున్న అభద్రత భావం
- ఇతర పార్టీల నుంచి వచ్చినవారికే ప్రాధాన్యత.. కష్టపడినోళ్లకు గుర్తింపులేదని నైరాశ్యం
- సోషల్ మీడియా వేదికగా ఆవేదనను పంచుకుంటున్న నేతలు, కార్యకర్తలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమయ్యింది. సుమారు పదేళ్లపాటు బీఆర్‌ఎస్ అధికారంలో ఉంది. అయితే అధికారంలో లేకపోయినా పలువురు నేతలు పార్టీ జెండాను పట్టుకుని ఉన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో వేధింపులను తట్టుకుని నిలిచారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంతో తమ కష్టాలు తీరినట్లేనని భావించారు. పదవులు దక్కుతాయని ఆశించారు. అయితే చాలామంది ఆశలు అడియాసలయ్యాయి. పార్టీ అధికారంలోకి రాగానే వలసలు మొదలయ్యాయి. అప్పటివరకు ఎవరికి వ్యతిరేకంగానైతే పోరాడారో.. వారినే పార్టీలో చేర్చుకోవడంతో పాత నేతలు ఇబ్బందిపడుతున్నారు. గతంలో తమను ఇబ్బందిపెట్టినవారికే పార్టీలో, పదవులలో అందలం దక్కుతోందన్న భావనతో వారిలో అభద్రత భావం నెలకొంటోంది. దీనిపై ఇటీవల తమ ఆవేదనను సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లగక్కుతున్నారు. ఓ కార్యకర్త తన వాట్సాప్ స్టేటస్‌గా 'గెలిచాక నీతో నడిచేవాళ్లకంటే గెలుపు కోసం వెంట నడిచిన వాళ్లను గుర్తుపెట్టుకోండి' అని పెట్టుకోగా.. దాన్ని చాలా మంది లైక్ చేయడం, షేర్ చేయడం ద్వారా తమ ఆవేదనను బయటపెట్టుకున్నారు. 'అధికారంలోకి వచ్చాం కదా అని నిజమైన కార్యకర్తలను వదులుకుంటే అధికారం లేనప్పుడు పోరాడటానికి ఎవరూ ఉండరు, గెలిచాక వచ్చిన వాళ్లు పార్టీ ఓడిపోతే కనిపించరు' అనే విషయాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. 'కార్యకర్తలకు ఇవ్వరు. వాళ్ల చుట్టాలకు, వాళ్ల దగ్గరి వాళ్లు, వాళ్ల బర్త్‌డేలు, పెళ్లి రోజులకు ఖర్చు పెట్టేవాళ్లకే పదవులు ఇస్తారు, పని చేసి పెడతారు. కార్యకర్తలకు ఏదీ ఇవ్వరు. పార్టీలు మార్చినోళ్లకు అధిక గౌరవం ఉంది కాంగ్రెస్‌లో. ఇది ఊరూరా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పరిస్థితి' అంటూ మరికొందరు సామాజిక మాధ్యమాల ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఆయా పోస్టులను మిగిలిన కార్యకర్తలు, నేతలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనబడుతోంది. అసలైన వారిని పట్టించుకోవాలని, అవసరం కోసం వచ్చిన వారిని వదిలేయాలని కోరుతున్నారు.







కాంగ్రెస్ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న పోస్టులు

అందరి దృష్టి 'స్థానికం'పైనే..

స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి చాలామంది ఉత్సాహంతో ఉన్నారు. అయితే పార్టీ టికెట్టు విషయంలో ముఖ్య నేతలు ఎలా వ్యవహరిస్తారోనన్న సందేహం వారిని వెంటాడుతోంది. పార్టీ గుర్తుపై జరిగే మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆరాటపడుతున్న నేతలు, కార్యకర్తలు చాలా మంది గ్రౌండ్‌వర్క్ చేసుకుంటున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ ముఖ్య నేతలను మచ్చిక చేసుకుని చక్రం తిప్పుతున్న వారి వల్ల తమ అవకాశాలకు గండిపడుతుందనే భయం వారిని వెన్నాడుతోంది. తమను కాదని కొత్తగా పార్టీలో వచ్చిన వారికి సహకరిస్తే ఊరుకోబోమనే సంకేతాలను సోషల్ మీడియా వేదికగా ఇస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారం ఎక్కడుంటే అక్కడుంటారంటూ..

పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అక్కడ వెలుగు వెలిగి, తమపై దౌర్జన్యాలు చేసిన వారంతా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కండువాలు మార్చి ఇక్కడా వారే పెత్తనం చేస్తున్నారని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం ఎక్కడుంటే అక్కడికి చేరేవారిని చేరదీయడం ద్వారా తమకు అన్యాయం చేస్తున్నారన్న అభిప్రాయంతో చాలామంది నేతలున్నారు. అధికారంలో లేనప్పుడు జెండాలు మోసిన వారిని పార్టీ పట్టించుకోవడం లేదని, అధికారం చేపట్టిన తరువాత వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ క్యాడర్ ఆవేదన చెందుతోంది. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలే వారినే ప్రోత్సహిస్తున్నారంటూ జిల్లాలోని ఆయా నియోజక వర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలు సామాజిక మాధ్యమాల వేదికగా తమ ఆవేదనను వెలిబుచ్చుతున్నారు. చాలా మంది తమ వాట్సాప్ స్టేటస్‌లుగా పెట్టుకుంటున్న కొటేషన్లను చూస్తుంటే వారు ఎంత ఆవేదనతో ఉన్నారో స్పష్టమవుతోంది. అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని నేతలు బాహాటంగా మాట్లాడుకుంటున్నారు.

అధికారంలోకి వచ్చాం కదా అని నిజమైన కార్యకర్తలని వదులుకుంటే అధికారం లేనప్పుడు పోరాడటానికి ఎవరు ఉండరు గెలిచాక వచ్చిన వాళ్ళు పార్టీ ఓడిపోతే కనిపించరు

'మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి'



దోమకొండ: స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. మహిళలు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. దోమకొండ వైద్య శిబిరంలో 124 మంది మహిళలకు ప్రత్యేక వైద్య సేవలను అందించామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, ప్రోగ్రాం అధికారులు శిరీష, రాధిక, అనురాధ, దోమకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేశాన్ని విశ్వగురువుగా చేయడమే ప్రధాని లక్ష్యం



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: భారత దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఎమెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ప్రధాని జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 11 ఏళ్లుగా దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న వ్యక్తి మోదీ అన్నారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానం చేయడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే హెల్మెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి'

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ప్రమీల సూచించారు. బుధవారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి రైతు వేదికలో కామారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు పోషణ మాసం, పోషణ్ భీ – పడాయి భీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాలపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన పోషణ మాసం వచ్చేనెల 16 వరకు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. కేంద్రాలకు వచ్చేవారిలో పోషణ లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కవిత, పద్మజ, ఉమ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

'సకాలంలో రుణాలు మంజూరు చేయాలి'



స్వచ్ఛతా హీ సేవ వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బ్యాంక్ అధికారులు

కామారెడ్డి క్రైం: అర్హులైన రైతులందరికీ సకాలంలో పంట రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు భూములకు సైతం పంట రుణాలను మంజూరు చేయాలన్నారు. భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, ఆర్‌బీఐ ఏజీఎం రాములు, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, ఎల్డీఎం చంద్రశేఖర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మరమ్మతుల పరిశీలన

మాచారెడ్డి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం మాచారెడ్డి మండలంలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పంచాయతీ రోడ్డుతో పాటు చుక్కాపూర్ మాచారెడ్డి పీడబ్ల్యూడీ రోడ్డు వరకు బండరామేశ్వరంపల్లి రోడ్డు మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ దుర్గాప్రసాద్, పాల్వంచ తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ దోమకొండ స్వామి, ఏఈఈలు సంజయ్, తేజస్విని ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్ : సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రంగోల్ స్వప్న, నిజాంసాగర్ మండలానికి చెందిన ఇర్ఫానా బేగంకు సంచార చేపల విక్రయ వాహనాలు మంజూరయ్యాయి. వాటిని బుధవారం కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, అడిషనల్ డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీపీఎంలు రాజయ్య, సురేష్, ఫిషరీస్ శాఖ అధికారి శ్వేత, జిల్లా సమాఖ్య అధ్యక్షులు పుష్పరాణి, మండల సమాఖ్య అధ్యక్షులు భూలక్ష్మి, సీసీలు శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే రాచరికం నుంచి విముక్తి

- రాష్ట్రంలో జరిగిన మార్పు వల్లే దేశవ్యాప్తంగా తెలంగాణకు కీర్తి
- ప్రజాపాలన దినోత్సవంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

కామారెడ్డి టౌన్: తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించి, రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారామని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హౌసింగ్ బోర్డ్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా అప్పటి వరకు పల్లెలో నెలకొన్న వెట్టి చాకిరీ, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, మాతృ భాష అణిచివేత, మతపరమైన నిరంకుశ ధోరణలు తొలగి హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థ నుంచి విముక్తి పొందిందన్నారు. రాష్ట్రంలో జరిగిన మార్పులతోనే దేశవ్యాప్తంగా తెలంగాణ కీర్తి గాంచిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందుందన్నారు. జిల్లా వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. రైతు భరోసా కింద జిల్లాలో 3,03,568 మంది రైతుల ఖాతాల్లో రూ. 305.98 కోట్లు జమచేశామన్నారు. కొత్తగా 16,152 రేషన్ కార్డులు మంజూరు చేశామని, 49,971 మంది కుటుంబ సభ్యులను పాత రేషన్ కార్డులలో జతచేశామని పేర్కొన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్ సరఫరా పథకం కింద జిల్లాలో 1,50,131 మంది వినియోగదారులకు 5,58,981 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో అన్ని రకాల పింఛన్‌లు కలిపి 1,62,000 మందికి ప్రతినెలా రూ. 36.12 కోట్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా జిల్లాలో 1,63,163 మంది వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు.

గత నెలలో కురిసిన వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రక్షణ చర్యల్లో నిమగ్నమైందని, తద్వారా ప్రాణనష్టం తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అత్యవసర బృందాల ఆధ్వర్యంలో 15 ప్రాంతాలలో 17 రక్షణ చర్యలు చేపట్టి 1,251 మందిని కాపాడారన్నారు. ముంపు ప్రాంతాలలో 740 కుటుంబాలలోని సభ్యులకోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, మందులు, ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. నష్టపోయిన 1,737 నివాస గృహాలకు రూ. 81.85 లక్షల పరిహారం మంజూరు చేశామని పేర్కొన్నారు. ప్రాణనష్టం జరిగిన ఆరు కుటుంబాలకు సీఎం చేతుల మీదుగా ఒక్కొక్క కుటుంబానికి 5 లక్షల చొప్పున అందజేశామన్నారు. జిల్లాలో 28,615 ఎకరాలలో పంటనష్టం జరిగిందన్నారు. కామారెడ్డిని నేర రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు శాఖ చర్యలతో పాటు ప్రజల సహాయ సహకారాలు అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

పురోగతిలో ఇళ్ల నిర్మాణాలు..

జిల్లాకు 11,621 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 6,063 నిర్మాణాలు ప్రారంభమయ్యాయని కోదండరెడ్డి తెలిపారు. ఇందులో 2,663 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు, 736 గోడ లెవల్ వరకు, 306 ఇళ్లు స్లాబ్ వరకు పూర్తయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ. 43.21 కోట్లు చెల్లించామని వివరించారు. నాలుగు మున్సిపాలిటీలలో 100 రోజుల కార్యాచరణ ద్వారా శానిటేషన్, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, పార్కుల నిర్వహణ లాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు.

క్లుప్తంగా

ఐక్యంగా ఉండి సమాజంలో ముందుకు పోవాలి

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



కామారెడ్డి రూరల్: విశ్వ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమాజంలో ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం దేవునిపల్లిలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్వకర్మ జయంతి ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన ఆశీస్సులతో కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు, దేవునిపల్లి అధ్యక్షుడు వడ్ల వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడు రాములు చారి, ప్రధాన కార్యదర్శి లింబాద్రిచారి, కోశాధికారి మురళి చారి, ఉపాధ్యక్షుడు రమేష్ చారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధిత విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు



కామారెడ్డి టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో వరద బాధిత విద్యార్థుల కోసం సేకరించిన పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ వాహనాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల వర్షం బీభత్సం వల్ల కాలనీలు జలమయం కావడంతో భారీ నష్టంతో పాటు విద్యార్థులకు నష్టం కలిగిందన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో 'గిఫ్ట్ ఏ నోట్ బుక్' పేరిట కార్యక్రమం చేపట్టి విద్యార్థులకు సామాగ్రి పంపిణీ చేయబోవడం అభినందనీయమన్నారు. ఏబీవీపీ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రంజిత్ మోహన్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



మాచారెడ్డి: మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి రాగుల నర్సింగరావు మన బడి పూర్వ విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రూ.50 వేల విలువైన టీవీని అందజేశారు. ఐక్య వేదిక అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడానికి టీవీ తోడ్పడుతుందని అన్నారు.పాఠశాల హెచ్‌ఎం స్వ ప్న.. దాతతో పాటు పూర్వ విద్యార్థుల ఐక్య వే దిక సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు సుష్మ, ఐక్య వేదిక సభ్యులు కలిమెల రాజిరెడ్డి, రాగుల దేవరాజు, చల్ల కృష్ణారెడ్డి ఉన్నారు.

తాగునీటి తిప్పలు

● కంబాపూర్ గ్రామస్తులకు వ్యవసాయ బోరుబావులే దిక్కు
● సమస్య గురించి పట్టించుకోని అధికారులు



దూర ప్రాంతాల నుంచి బైక్‌పై నీటిని తీసుకొస్తున్న గ్రామస్తులు



కంబాపూర్ గ్రామ వ్యవసాయ భూముల్లో నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

పిట్లం(జుక్కల్): కొన్ని రోజులుగా కంబాపూర్ గ్రామస్తులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామం మొత్తానికి రెండు సింగిల్ ఫేజ్ మోటార్లున్నాయి. కాని ఆ నీళ్లు అన్ని ఇళ్లకు సరిపోవడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు మంచిగా రావడం లేదు. అవి కూడా 2 బిందెల కంటే ఎక్కువ రాకపోవడంతో గ్రామంలో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. గత నెల నుంచి గ్రామంలో నీటి సమస్య తీవ్రమైంది. పలు మార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది. చేసేదేమీ లేక గ్రామ శివారుల్లో ఉన్న వ్యవసాయ బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. పొలం గట్ల మీద నడుచుకుంటూ తెచ్చుకుంటున్నామని, పలుమార్లు జారిపడి దెబ్బలు తగులుతున్నాయని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొంత మంది దూర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలపై నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో నీటి సమస్య వల్ల కూలి పనులకు వెళ్లలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పనులకు వెళ్లలేకపోతున్నాం



గ్రామంలో గత నెల నుంచి నీటి సమస్య తీవ్రమైంది. నీటిని పొలాల నుంచి తెచ్చుకుంటున్నాం. నీళ్లు లేక పనులకు కూడా వెళ్లలేకపోతున్నాం. గ్రామం నుంచి వ్యవసాయ భూమికి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉంది. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి. – కృష్ణ, కంబాపూర్

సమయానికి పంపలేకపోతున్నాం



గ్రామంలో నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ బోరు బావుల నుంచి పిల్లలు, మేము కలిసి నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఈ సమస్య వల్ల పిల్లలను పాఠశాలలకు సమయానికి పంపలేక పోతున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి. – సాయగౌడ్, కంబాపూర్

సేవా దృక్పథంతో ముందుకు రావాలి

● సబ్ కలెక్టర్ కిరణ్మయి



బిచ్కుందలో కిట్లు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్

మద్నూర్/బిచ్కుంద(జుక్కల్): ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు రావాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. వర్షాలకు ఇళ్లు కూలిపోయిన, ఇళ్లకు నష్టం వాటిల్లిన బాధితులకు బుధవారం దుప్పట్లు, దుస్తులు ఇతర సరుకులను సబ్ కలెక్టర్ కిరణ్మయి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న చేతులు మీదుగా పంపిణీ చేశారు. బిచ్కుంద, మద్నూర్‌లలో ఈ కిట్లను అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదానం, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు సంజీవ్, నరసింహ, వేణుగోపాల్, రచ్చ శివకాంత్, డాక్టర్ నర్సింలు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

సరైన పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం



శిక్షణ శిబిరానికి హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

బాన్సువాడ రూరల్: సరైన పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని బాన్సువాడ సీడీపీవో సౌభాగ్య అన్నారు. తాడ్కోల్ రైతువేదికలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ బీ..పడాయి బీ మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 3 రోజులుగా వివిధ సెక్టార్‌లకు చెందిన సూపర్‌వైజర్లు కార్యక్రమం విజయవంతానికి అంగన్‌వాడీ టీచర్లు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారన్నారు. అక్టోబర్ 16 వరకు జరిగే పోషణ మాసాన్ని విజయవంతం చేయాలని కోరారు. సూపర్‌వైజర్లు షహనాజ్‌బేగం, రాజేశ్వరి, పద్మ, సుమలత, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

క్యాసంపల్లిలో..

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, పోషన్ అభియాన్ కో–ఆర్డినేటర్, 100 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మోదీ జన్మదినం కాదు నిరుద్యోగ దినం



బాన్సువాడ: ప్రధాన మంత్రి మోదీ జన్మదినం కాదని సెప్టెంబర్ 17న జాతీయ నిరుద్యోగ దినం చేయాలని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు బుధవారం జాతీయ నిరుద్యోగ దినం నిర్వహించారు. నిరుద్యోగులతో కలిసి టీ అమ్ముతూ, బైక్ రిపేర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి గద్దె ఎక్కిందన్నారు. అధికారంలో రాగానే నిరుద్యోగుల పొట్టగొడుతుందని మండిపడ్డారు. వెంటనే ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ చేయాలని అన్నారు. నాయకులు మన్సూర్, తిరుమల్‌రెడ్డి, సలీం, శ్రీనివాస్, అందే రమేష్, గౌస్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీకి సౌదాగర్ అరవింద్‌కు సంబంధం లేదు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్‌గా చలామణి అవుతున్న సౌదాగర్ అరవింద్‌కు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన అరవింద్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కుక్కల చంపివేత కలకలం

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు క్యాంప్ గ్రామంలో వీధి కుక్కలను మందుపెట్టి చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువ అవ్వడంతో సుమారు 50 కుక్కలకు మందు పెట్టి హతమార్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కరీంనగర్ చెందిన యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధి గౌతమ్ బోధన్ రూరల్ పోలీసులకు ఈ నెల 15న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కుక్కల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని పాత అంగడిబజార్ సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేసే అహ్మద్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ బాలికను వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. కాగా, సదరు వ్యక్తికి ఇప్పటికే ఇద్దరు భార్యలు ఉన్నట్లు తెలిసింది.

ఇద్దరి రిమాండ్

నిజామాబాద్ రూరల్: ఆల్ప్రోజోలం పట్టివేత కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై ఆరిఫ్ బుధవారం తెలిపారు. మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండారం గ్రామంలో 600 గ్రాముల ఆల్ప్రోజోలంను నార్కోటిక్స్ అధికారులు పట్టుకున్నారు. నిందితులు అశోక్, రమేశ్‌గౌడ్‌ను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించగా, బుధవారం వారిని రిమాండ్‌కు తరలించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మోపాల్: మండల కేంద్ర శివారులో అక్రమంగా తరలిస్తున్న 20.70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జడ్‌సుస్మిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కాల్పోల్ తండాకు చెందిన రూడవత్ కృష్ణ (టీఎస్ 16యూసీ 1081) టాటా ఇంట్రా గూడ్స్ వెహికల్‌లో బియ్యం తరలిస్తున్నారు. వాటిని తనిఖీ చేయగా 20.70 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయి. వెంటనే బియ్యం, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కృష్ణపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మేజర్‌వాడి గ్రామంలో బుధవారం జరిగిన ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన ఆరె మారుతీరావు, ఆరె నాందేవ్ కుటుంబసభ్యులు బుధవారం ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ విషయమై ఇరువర్గాలు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

పేకాడుతున్న ఐదుగురిపై కేసు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం పేకాటస్థావరంపై దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.12,300 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

కుక్కల దాడిలో మేకల మృతి

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో కుక్కల దాడిలో రెండు మేకలు మృతి చెందాయి. నందిపేటకు చెందిన ఎస్‌కే. అజీం తన ఇంటి ఎదుట రెండు మేకలను కట్టేసి ఉంచాడు. కాగా, ఒక్కసారి గుంపులుగా వచ్చిన కుక్కలు దాడి చేసి రెండు మేకల గొంతులను పట్టేసాయి. మేకల అరుపులు విని కుక్కలను తరిమివేసే ప్రయత్నం చేసినా కుక్కలు మేకలను విడిచి పెట్టకుండా వాటి తల, మొండెం భాగాలను వేరు చేశాయి.

రేసుకుక్కల దాడిలో 9 గొర్రెలు, ఒక మేక..



రేసు కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఎల్లారెడ్డిరూరల్: రేసు కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 9 గొర్రెలు, ఒక మేక మృతి చెందినట్లు బాధితుడు రవి తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డి కట్టకింది తండాకు చెందిన రవి గొర్రెల మందపై రేసు కుక్కలు దాడి చేశాయి. ఘటనా స్థలాన్ని బీట్ ఆఫీసర్ మౌనిక పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూడాలని బాధితుడు కోరారు.

మెండోరాలో భారీ చోరీ

● ఆరు తులాల బంగారం అపహరణ



వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై సుహాసిని

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేర రామకృష్ణ దంపతులు మెండోరా మండల కేంద్రంలో కిరాణాషాపును నిర్వహిస్తారు. రోజూ ఇంటికి తాళం వేసి వచ్చి షాపులో ఉంటారు. పట్టపగలు గుర్తుతెలియని దుండగులు తాళం పగుల గొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 6 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 30 వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన కుమారుడు తాళం పగుల గొట్టి ఉండడాన్ని గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేలోపు భారీ చోరీ జరిగింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై సుహాసిని ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బాన్సువాడలో రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల



పెద్దకొడప్‌గల్ పాపహరేశ్వర ఆలయ ఆవరణలో రక్తదాన శిబిరం

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేకులు కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు, రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే పలు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేసి రక్త దానం నిర్వహించారు. మోదీ పేరిట ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.



బిచ్కుంద ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అరుణతార



కామారెడ్డిలో రక్తదాతలకు హెల్మెట్, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రైల్వే ఎస్సై లింబాద్రి



సదాశివనగర్ బీజేపీ కార్యాలయం వద్ద ..



దోమకొండలో రోగులకు పండ్ల పంపిణీ ..



మాచారెడ్డిలో..



లింగంపేటలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి , ఇతర బీజేపీ నేతలు

ప్రభుత్వ కార్యాలయాలలో పీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో మోదీ చిత్రపటాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: ప్రభుత్వ కార్యాలయాలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డికి బీజేపీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మోదీ చిత్రపటాన్ని అందించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రధానమంత్రి చిత్రపటం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో ..



పిట్లం ఆస్పత్రిలో రోగులకు పండు పంపిణీ చేసిన గాండ్ల తెలికుల సంఘ సభ్యులు

పిట్లం(జుక్కల్): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడు ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలి కులానికి చెందిన వ్యక్తి దేశ అత్యున్నత పదవిలో ఉండటం తమకు గర్వకారణమని పేర్కొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం



జిల్లా కేంద్రంలో భరతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట జెండా ఎగురవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు

సాక్షి నెట్‌వర్క్: బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేసి భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



భిక్కనూరులో..



మద్నూర్ బీజేపీ కార్యాలయం వద్ద..

గ్రామాల్లో మహిళలకు వైద్య పరీక్షలు



లింగంపేట పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది



హన్మాజీపేట్ పీహెచ్‌సీలో కంటిని పరీక్షిస్తూ..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు పోల్కంపేట, పోతాయిపల్లి, మోతె, బాణాపూర్, భవానిపేట, ముంబోజిపేట తదితర గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో 'స్వస్థ నారీ..స్వశక్తినారీ' కార్యక్రమంలో భాగంగా 56 మందికి పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ రమాదేవి, పీహెచ్‌సీ వైద్యులు రాంబాయి, సీహెచ్‌వో రమేశ్, పర్యవేక్షకులు ఫరీదా, చంద్రకళ, యాదగిరి, గీత, భాగ్య, అంజలి, పాలవ్వ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

హన్మాజీపేట్ పీహెచ్‌సీ పరిధిలో..

బాన్సువాడ రూరల్: స్వస్థనారీ..స్వశక్తినారీ కార్యక్రమం బుధవారం హన్మాజీపేట్ పీహెచ్‌సీలో ప్రారంభించారు. కార్యక్రమం వచ్చే నెల 2 వరకు కొనసాగుతుందని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ తెలిపారు. తొలిరోజు మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజు మహిళలకు దీర్ఘకాలిక రోగాలు, బీపీ, షుగర్, టీబీ, గుండెపోటు, పక్షవాతం, రక్తనాళాలు దెబ్బతినడం తదితర వ్యాధులకు పరీక్షించి ఉచితంగా వైద్యం అందజేస్తామని డాక్టర్ తెలిపారు. కోనాపూర్‌లోనూ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

తెలంగాణ చరిత్రను మలుపుతిప్పిన రోజు

● వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ చరిత్రను 1948 సెప్టెంబర్ 17 మలుపుతిప్పిన రోజని, శతాబ్దాల బానిస సంకెళ్లను తుంచి స్వాతంత్య్రం పొందిన ఉద్విగ్న సందర్భమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం తెయూ పరిపాలనా భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజరికం పరిసమాప్తమై తెలంగాణ సమాజం నిజాం కబంద హస్తాల నుంచి విమోచన పొందిన రోజన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, అధ్యాపకులు పాత నాగరాజు, శాంతాబాయి, పీఆర్వో పున్నయ్య, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.